పారా మెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

నర్సంపేట రూరల్, నవంబర్ 25 : పారా మెడికల్ కోర్సుల్లో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు నర్సంపేట ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ దివ్వెల మోహన్ దాస్ తెలిపారు. ఈ నెల 29న ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అభ్యర్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కళాశాలలో డీఈసీజీలో 27, డయాలసిస్‌లో 13 ఖాళీలు ఉన్నాయని వివరించారు.

డీఈవో ఆదేశాలు బేఖాతరు

గిర్మాజీపేట, నవంబర్ 25 : వరంగల్ ఆటోనగర్‌లోని గిర్మాజీపేట ఉన్నత పాఠశాలలో డీఈవో ఆదేశాలను బేఖాతరు చేశారు. ఇటీవల మధ్యాహ్న భోజనంలో కూరలు రుచికరంగా వండడం లేదని, సరిపడా వడ్డించడం లేదని, అన్నంలో రాళ్లు వస్తున్నాయని విద్యార్థులు ఫిర్యాదుచేయగా డీఈవో శనివారం క్షేత్రస్థాయిలో సందర్శించి, కలెక్టర్ ఆదేశాలతో పాఠశాలలోని కుకింగ్ ఏజెన్సీని విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ, వాటిని తుంగలో తొక్కి గతంలో వంట చేసిన మహిళ కుటుంబ సభ్యులతోనే సోమవారం వంట చేయించారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డీఈవో ఆదేశాలను పాటించడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో విద్యాశాఖాధికారులు ప్రత్యేక చొరవ చూపి, వెంటనే గతంలో పని చేసినవారు, వారి కుటుంబసభ్యులకు కాకుండా వేరేవారికి వంట చేసే బాధ్యత అప్పగించాలని కోరుతున్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

ఖానాపురం, నవంబర్ 26 : మండలకేంద్రంలోని హరితమిత్ర, పాకాల రైతుమిత్ర సంఘాలకు సంబంధించిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏవో శ్రీనివాస్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకొస్తేనే ఏఈవోలు టోకెన్ జారీ చేస్తారని తెలిపారు. ఆయన వెంట నర్సంపేట ఏఎంసీ వైస్ చైర్మన్ హరిబాబు, నిర్వాహకులు ఉన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియజేయునది ఏమనగా, నాయొక్క క్లయింట్ అయిన గుగులోతు రామస్వామి, తండ్రి:లాలు, నివాసము: ఇంటి నెం. 5-ఎ/1, ఖానాపూర్ రోడ్, నర్సంపేట్, వరంగల్ జిల్లా గారు, రామా చంద్రమోహన్, S/o. లేట్ శంకర్‌లింగం, రామా స్వరూప, భర్త: లేట్ జగన్‌మోహన్, రామా పృథ్వి, S/o. లేట్ జగన్‌మోహన్, రామా స్వప్న, భర్త: లేట్ రాధాకృష్ణ, వైశ్యం అన్నపూర్ణ, భర్త: భాస్కర్, అడ్డగట్ల అప్పర్, భర్త: వెంకటేశ్వర్లు, రామా ప్రియాంక, తండ్రి: లేట్ జగన్‌మోహన్, రామా జ్యోస్న, తండ్రి: లేట్ జగన్‌మోహన్ గార్లపై నర్సంపేట గ్రామ శివారులోని సర్వే నెం. 111/1/91 మరియు 111/1/92 లో గల ఎ. 3-30 గుంటల భూమిపై తనకు చేసిన సేల్ అగ్రిమెంట్‌ను అమలుపర్చలేనిదిగా కోరుతూ గౌరవ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు నందు ఓ.యస్. నెం. 38/2024 కేసును ఫైలు చేయడం జరిగింది. ఇట్టి కేసులో గౌరవ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి కోర్టు గారు ఐ.ఎ.నెం. 1063/2024లో యథాతథ స్థితి కొనసాగించవలసిందిగా ఉత్తర్వులు జారీ చేయనైంది. కావున ఇట్టి స్థలమునుపై ఇతరులెవ్వరు ఎటువంటి క్రయ ఒప్పందాలు గాని మరియు తనఖాలు గాని చేసుకోకూడదని తెలియపర్చనైంది. ఇట్టి ఉత్తర్వులు ఉన్నందున వేరే ఎవ్వరైనా క్రయ ఒప్పందాలు గాని మరియు తనఖాలు గాని చేసుకున్నచో అట్టి ఒప్పందములు చెల్లనేరవని ఇందుమూలముగా తెలియజేయనైంది. ఇట్టి ఆస్తి విషయంలో ఎవరైనా ఎలాంటి లావాదేవీలు జరిపినచో అట్టి వారు నా క్లయింటు తీసుకోబోయే సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు పూర్తి బాధ్యులు కాగలరు.
తేది: 26-11-2024
సం/- సి.విద్యాసాగర్‌రెడ్డి,
ఇంటి నెం.1-7-427/1, రెమెన్యూ కాలనీ,
హనుమకొండ సెల్ : 9849169060

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I **Shobha Rani E** W/o **Thotte Ravi** Resident of Balaji Nagar H.No- 25-11-286/2, Kazipet declare that I changed my name from **Shobha Rani E** to **Thotte Rani.**
NTW-000

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777559
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

మానుకోట ధర్నాకు తరలిన బీఆర్ఎస్ శ్రేణులు

గిర్మాజీపేట/నర్సంపేట/నర్సంపేట రూరల్/చెన్నారావుపేట/నెక్కొండ, నవంబర్ 25 : రాష్ట్రంలో రైతులు, గిరిజనులు, దళితులు, ఆదివాసీలపై జరుగుతున్న దాడులకు నిరసనగా సోమవారం మానుకోటలో కేటీఆర్ అధ్యక్షతన తలపెట్టిన రైతు ధర్నా కార్యక్రమంలో పాల్గొనడానికి జిల్లా నుంచి బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తూర్పు నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో భారీ ఎత్తున కాన్వాయ్‌లో వెళ్లారు. ఉదయం శివనగర్‌లో ధర్నాకు వెళ్లే కార్యకర్తల కాన్వాయ్‌ను నన్నపునేని జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ముఖ్యనాయకులు, మహిళా కార్యకర్తలు పాల్గొన్నారు. అలాగే, నర్సంపేటలో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులు, కౌన్సిలర్లు, చైర్మన్లు, సొసైటీ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు, నాయకులు పెద్ద ఎత్తున మానుకోటకు తరలివెళ్లారు. అలాగే, నర్సంపేటలోని తెలంగాణ ఉద్యమకారులు అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించిన అనంతరం ధర్నాకు బయలు దేరారు. దార్ల రమాదేవి, మచ్చిక నర్సయ్యగౌడ్, బైరి తిరుపతిరెడ్డి, పులిగిల్ల యాదగిరి, అప్పాల సుదర్శన్, మంచోజు కల్యాణరాముడు, మునిగాల సాయికృష్ణారెడ్డి, దండుగ రమేశ్, దొంగల సురేశ్, దోనాల రవి, గాండ్లోజు భాస్కర్, వేల్పుల సురేశ్, పెండ్యాల యాదగిరి, మేడిద శ్రీనివాస్, మోడం కోటి, రాజమౌళి పాల్గొన్నారు. నర్సంపేట మండలంలోని వివిధ గ్రామాల నుంచి బీఆర్ఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు నామాల సత్యనారాయణ, ఈర్ల నర్సింహరాములు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు మానుకోటకు తరలివెళ్లారు. మండల క్లస్టర్ ఇన్‌చార్జిలు మోతె పద్మనాభరెడ్డి, మోతె జయపాల్‌రెడ్డి, కోమాండ్ల గోపాల్ రెడ్డి, మోటూరి రవి, మచ్చిక నర్సయ్య గౌడ్, కడారి కుమారస్వామి, కొడారి రవన్న, కట్ల సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీలు భూక్యా వీరన్న, పెద్ది శ్రీనివాస్‌రెడ్డి, ముఖ్య నాయకులు భూక్యా వీరునాయక్, వల్లాల కర్ణాకర్, సంకటి గణపతి రెడ్డి, మాజీ సర్పంచ్ గొడిశాల రాంబాబు పాల్గొన్నారు. చెన్నారావుపేట మండలంలో పార్టీ మాజీ అధ్యక్షుడు బాల్నెవెంకన్న ఆధ్వర్యంలో నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. వారిలో మాజీ జడ్పీటీసీ పత్తినాయక్, సొసైటీ చైర్మన్ మురహరి రవి, మాజీ సర్పంచ్‌లు అనుముల కుమారస్వామి, కాలునాయక్, కడారి సాయిలు, మురళి తదితరులు ఉన్నారు. నెక్కొండ మండలం నుంచి ధర్నాకు తరలి వెళ్లిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు సంగని సూరయ్య, న్యాయవాది కొమ్ము రమేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ జాటోత్ రమేశ్‌నాయక్, మాజీ జడ్పీటీసీ లావుడ్య సరోజ హరికిషన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొనిజేటి భిక్షపతి, మాజీ ఉప సర్పంచ్ దేవనబోయిన వీరభద్రయ్య, మండల నాయకులు ఈదునూరి యాకయ్య, బాదావత్ రవి, వాగ్యానాయక్, మాదార్ ఉన్నారు.

గిర్మాజీపేట : జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

నర్సంపేట : మహబూబాబాద్‌కు తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులతో మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : మానుకోటకు తరలివెళ్తున్న మండల బీఆర్ఎస్ నాయకులు

చెన్నారావుపేట : మానుకోట సభకు వెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ : మానుకోట బీఆర్ఎస్ మహాధర్నాకు బయలు దేరిన నాయకులు

ఐదు బైక్‌లు, 11 ఇసుక ట్రాక్టర్లు సీజ్

ఖిలావరంగల్/మట్టెవాడ, నవంబర్ 25 : చింతల్‌లో చేపట్టిన వాహన తనిఖీల్లో మితిమీరిన వేగంతో నడిపిన ఐదు బైక్‌లను సీజ్ చేసినట్లు సీఐ జే వెంకటరత్నం తెలిపారు. వాహనదారులను పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించినట్లు పేర్కొన్నారు. అలాగే, అనుమతులు లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను కూడా సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. కాగా, నగరంలోకి అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు మట్టెవాడ సీఐ టీ గోపి తెలిపారు. అక్రమంగా ఇసుకను తరలిస్తే కేసు నమోదు చేయడమే కాకుండా వాహనాలను సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు.

ముగ్గురిపై కేసు నమోదు

గీసుగొండ, నవంబర్ 25 : మహిళతో గొడవ పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మహేందర్ తెలిపారు. గ్రేటర్ 16వ డివిజన్ గొర్రెకుంట క్రాస్ రోడ్డు వద్ద గండమల్ల వసంత 11 ఏళ్లుగా చిన్న డబ్బా పెట్టుకొని కూల్‌డ్రింక్స్, సిగరెట్లు అమ్ముతూ జీవిస్తోంది. ఆదివారం రాత్రి వరంగల్‌కు చెందిన తొగరి శ్రీనివాస్‌తో పాటు అతడి స్నేహితులు ఆమె వద్ద సిగరెట్ తీసుకొని లైటర్ అడిగారు. వెలిగించుకొని లైటర్ ఇవ్వకుండా వెళుతున్న వారిని ఆమె ప్రశ్నించినందుకు శ్రీనివాస్ బూతులు తిడుతూ బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాధు మేరకు వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

అఘోరీపై కేసు నమోదు

కరీమాబాద్, నవంబర్ 25 : జిల్లాకు వచ్చిన అఘోరీ నాగసాదుపై మామునూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఇటీవల బెస్తం చెరువు సమీపంలోని ఓ శ్మశానవాటికలో పూజలు చేసే క్రమంలో కోడిని మెడ తిప్పి కొరికిందని ఆరోపిస్తూ జంతు ప్రేమికుడు రోహన్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు జంతు సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పోలీసుల అదుపులో గంజాయి రవాణాదారులు?

నర్సంపేట రూరల్, నవంబర్ 25 : నర్సంపేట పోలీసుల అదుపులో గంజాయి రవాణా దారులు ఉన్నట్లు సమాచారం. ద్వారకపేట శివారు మార్కెట్ బైపాస్‌రోడ్డులో సోమవారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా గంజాయి పట్టుకున్నట్లు తెలిసింది. ఖానాపురం మండలానికి చెందిన ఇద్దరు వ్యక్తులు గంజాయిని రవాణా చేస్తుండగా పోలీసులు పట్టుకొని స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. వీరి నుంచి ఎక్కువ మొత్తంలో గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.

కోతుల దాడిలో ఇద్దరికి గాయాలు

రాయపర్తి, నవంబర్ 25 : మండల కేంద్రానికి చెందిన ఇద్దరిని కోతులు దాడి చేసి గాయపర్చిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మానసిక దివ్యాంగురాలైన మహ్మద్ సలీమా, యాదవ కాలనీకి చెందిన వృద్ధురాలు కుంట రామక్క ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న సమయంలో కోతుల గుంపు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. బాధితులిద్దరిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. గ్రామంలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కోతులు, కుక్కలను నియంత్రించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వెయిట్ లిఫ్టింగ్‌లో నేషనల్స్‌కు నర్సంపేట విద్యార్థి

నర్సంపేట, నవంబర్ 25 : వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయి పోటీలకు నర్సంపేటకు చెందిన విద్యార్థి వంశీకృష్ణ ఎంపికయ్యారు. నర్సంపేటలోని గాంధీనగర్ రామాలయం వీధికి చెందిన మాటేటి రజిత, సాంబయ్య కుమారుడు వంశీకృష్ణ సోమవారం స్కూల్స్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి వెయిట్‌లిఫ్టింగ్ పోటీలో పాల్గొని మూడో స్థానంలో నిలిచాడు. ఈ మేరకు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకాగా, విద్యార్థిని జూనియర్ డిఫెన్స్ కాలేజీ కరస్పాండెంట్ తిరుపతి, పీడీ కమల్ అభినందించారు.

వంశీకృష్ణ

యువత మత్తుకు బానిస కావొద్దు

నల్లబెల్లి, నవంబర్ 25 : యువత మత్తుకు బానిసలై నిండు జీవితాలను బలి చేసుకోవద్దని రూరల్ సీఐ సాయిరమణ సూచించారు. సీపీ ఆదేశాల మేరకు మండలంలోని రామతీర్థంలో పోలీస్ జాగృతి కళాబృందంతో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సీఐ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. మూడనమ్మకాల బారిన పడి ఆర్థికంగా నష్టపోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై లక్ష్మారెడ్డి, కళాబృందం ఇన్‌చార్జి నాగమణి, విలియమ్స్, వెంకటేశ్వర్లు, రత్నయ్య,, శ్రీనివాస్, నారాయణ, విక్రమ్‌రాజ్, చిరంజీవి పాల్గొన్నారు.

మహిళా హక్కుల రక్షణకు కృషి చేయాలి

వర్ధన్నపేట, నవంబర్ 25 : మహిళల హక్కులను సంరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షురాలు, సామాజిక వేత్త అనిశెట్టి రజిత అన్నారు. 'మహిళలపై హింస వ్యతిరేక దినం- వైట్ రిబ్బన్ డే' సందర్భంగా మండల కేంద్రంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. మహిళలపై దాడుల కారణంగా ప్రతిభ ఉన్నప్పటికీ అన్ని రంగాల్లో ముందుకు రావడం లేదన్నారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి పల్లెపాడు దామోదర్, సంస్థ ప్రతినిధులు లలిత, సువర్ణ, నీరజ, మాధవీలత, రవీందర్, అక్తర్, వాణి, సరేశ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అనిశెట్టి రజిత

నర్సంపేటలో వైద్యశిబిరం

నర్సంపేట, నవంబర్ 25 : నర్సంపేటలో వరంగల్ రోడ్డు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ వీఎం జయుడు, అధ్యక్షుడు నాగిశెట్టి ప్రసాద్, డాక్టర్ రవికృష్ణ, మోతె ఇంద్రసేనారెడ్డి, పెండెం భాస్కర్, శ్రీకాంత్, వీరారెడ్డి, వెంకన్న, సురేశ్, శ్రీనివాస్, పెండెం రాజు పాల్గొన్నారు.

రైస్ మిల్లర్లు సహకరించాలి : కలెక్టర్

ఖిలావరంగల్, నవంబర్ 25 : ధాన్యం కొనుగోలు, కస్టం మిల్లింగ్ రైస్(సీఎంఆర్) విషయంలో జిల్లా రైస్ మిల్లర్లు సహకరించాలని కలెక్టర్ డాక్టర్ సత్య శారద కోరారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్ వీసీ హాల్‌లో రైస్ మిల్లర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల నుంచి మిల్లులకు వచ్చిన ధాన్యం ఎఫ్ఏక్యూ నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లుగా గుర్తించిన తర్వాతనే ఎలాంటి కోత విధించకుండా దిగుమతి చేసుకోవాలన్నారు. ఈ విషయంలో మిల్లర్లు అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్‌లో ఎలాంటి వ్యాపారం చేయకుండా లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, నర్సంపేట ఆర్డీవో ఉమారాణి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ సంధ్యారాణి, డీసీవో నీరజ, డీఏవో అనురాధ, మిల్లర్ల అధ్యక్షుడు సంపత్‌కుమార్ పాల్గొన్నారు. అలాగే, వరంగల్ జిల్లాకు వచ్చిన కేంద్ర ప్రభుత్వ సెక్రటేరియట్ అధికారులతో కలెక్టర్ సత్య శారద ముఖాముఖి మాట్లాడారు. జిల్లాలో సంక్షేమ, అభివృద్ధి పథకాలు సమర్థవంతంగా అమలు చేస్తున్నామని, వాటి అధ్యయనంతోపాటు చారిత్రక, పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని కలెక్టర్ వారికి సూచించారు. వచ్చే నెల 3 వరకు జిల్లాలో పర్యటన ఉంటుందని తెలిపారు.

ప్రజావాణికి 107 దరఖాస్తులు

వరంగల్ కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణిలో 107 మంది వినతులు సమర్పించారు. ఖిలావరంగల్ రోడ్డులోని బొడ్రాయి ప్రతిష్ఠాపన అనంతరం మిగిలిన రూ.13 లక్షలు నిర్వహకుడు సారంగపాణి తన వద్దే ఉంచుకున్నాడని విద్యానగర్‌కాలనీకి చెందిన అచ్చ వినోద్‌కుమార్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. అలాగే, వివిధ శాఖల్లో నియమించిన వీఆర్వోల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వారు కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. తెలంగాణ పేదలకు ఉచిత విద్య, వైద్యం, ఉపాధి, ఒక ఎకరం సాగు భూమి, నాలుగు గదుల పక్కా ఇళ్లు అందజేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేడల ప్రసాద్ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చారు. అలాగే, వరంగల్ ఎంజీఎం దవాఖానలో జరుగుతున్న అవినీతిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బహుజన్ సమాజ్ పార్టీ వరంగల్ అధ్యక్షుడు నాగరాజు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి సమస్యలను వెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మొత్తం దరఖాస్తుల్లో ప్రధానంగా 43 భూ సంబంధిత సమస్యలు రాగా డీఆర్డీవో 12, కలెక్టరేట్ ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌కు 9, డీఎంహెచ్‌వోకు చొప్పున ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, డీఆర్డీవో కౌసల్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సత్య శారద

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ పెట్టాలి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్, నవంబర్ 25 : ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు శ్రద్ధ పెట్టాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఆదేశించారు. సోమవారం కార్పొరేషన్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌లో కమిషనర్ ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. కాశీబుగ్గ మాధురినగర్ రోడ్ నంబర్-3లో రోడ్డు, డ్రైనేజీలు లేక ఇబ్బందులు పడుతున్నామని, పరిష్కరించాలని స్థానికులు కోరారు. కీర్తి నగర్‌లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని కాలనీ వాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. 42వ డివిజన్ తెలంగాణ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే నిర్మించాలని స్థానికులు కోరారు. 4వ డివిజన్ జ్యోతిబసు నగర్ గుడిసె కాలనీలో కనీస వసతులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. గ్రీవెన్స్‌లో 88 వినతులు వచ్చాయి. టౌన్‌ప్లానింగ్ విభాగానికి 42, ఇంజినీరింగ్ విభాగం 21, ప్రజారోగ్య విభాగం 12, పన్నుల విభాగం 9, తాగునీటి సరఫరా 3, హార్టికల్చర్ 2 వినతులు వచ్చాయి. గ్రీవెన్స్‌లో ఎస్ఈలు ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజిరెడ్డి, ఎంహెచ్‌వో రాజేశ్, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్ర రాడేకర్, డీఎఫ్‌వో శంకరలింగం, కార్యదర్శి అలివేలు, బయాలజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, డిప్యూటీ కమిషనర్లు కృష్ణారెడ్డి, ప్రసన్నరాణి, ట్యాక్సేషన్ అధికారి బిర్రు శ్రీనివాస్ పాల్గొన్నారు.

వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

ప్రభుత్వ పాఠశాలల్లో అధికారుల తనిఖీలు

వంట గదులు, భోజనాల పరిశీలన

నల్లబెల్లి/సంగెం/చెన్నారావుపేట, నవంబర్ 25 : కలెక్టర్ సత్య శారద ఆదేశాల మేరకు జిల్లాలోని పలు ప్రభుత్వ గురుకుల, ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న భోజనాన్ని అధికారులు సోమవారం తనిఖీ చేశారు. నల్లబెల్లి మండలంలోని మూడు చెక్కలపల్లె గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలను తహసీల్దార్ ముప్పు కృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల నిర్వహించిన మాక్ పార్లమెంట్ పోలింగ్ కార్యక్రమాన్ని ఆయన తిలకించారు. అనంతరం హాస్టల్‌లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని క్షుణ్ణంగా పరిశీలించి, విద్యార్థులతో కలిసి ఆయన భోజనం చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అలాగే, మండల ప్రత్యేక అధికారి గోవిందరాజన్‌తోపాటు డివిజనల్ ఎస్‌వో వెంకట్రావు, ఏఎస్‌వో అనిల్ మండలకేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌తో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన వసతులను పరిశీలించారు. కార్యక్రమాల్లో వార్డెన్ వీరమ్మ తదితరులు పాల్గొన్నారు. సంగెం మండల కేంద్రంలోని గిరిజన బాలుర వసతి గృహాన్ని తహసీల్దార్ రాజ్‌కుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని సూచించారు. అలాగే, మండలంలోని పల్లార్‌గూడ, వీఆర్ఎన్‌తండా, పోచమ్మతండా గ్రామాల్లో పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఎంపీడీవో రవీందర్ తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సామగ్రిని పరిశీలించారు. చెన్నారావుపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని తహసీల్దార్ ఫణికుమార్ తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

సమయ పాలన పాటించని వైద్య సిబ్బంది

కోట యూహెచ్‌సీలో రోగుల నిరీక్షణ

ఖిలావరంగల్, నవంబర్ 25 : ఖిలావరంగల్ పడమర కోటలోని యూహెచ్‌సీలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో రోగులు నిరీక్షించక తప్పడం లేదు. పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఊరికి చివర ఉండడంతో ఎలాంటి రవాణా సౌకర్యం ఉండదు. దీంతో పీహెచ్‌సీకి రోగులు సుమారు మూడు కిలోమీటర్ల దూరం నడుచుకుంటూ వెళ్తారు. అంతదూరం వెళ్లినా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో ఉండరని స్థానికులు ఆరోపిస్తున్నారు. వైద్యాధికారుల పర్యవేక్షణ లేపకోవడం వల్లే వైద్యసిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దగ్గు, జలుబు, విష జ్వరాలు ప్రబలుతున్న నేపథ్యంలో వైద్య సిబ్బంది అందుబాటులో ఉండకపోవడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు పది మంది రోగులు వైద్య పరీక్షల కోసం యూహెచ్‌సీ వెళ్లగా అక్కడ కేవలం వైద్యాధికారి డాక్టర్ సుధ మినహాయిస్తే ఇతర సిబ్బంది హాజరు కాకపోవడంపై రోగులు అసహనం వ్యక్తం చేశారు. పడమర కోటలోని యూహెచ్‌సీలో వైద్య సిబ్బంది సమయపాలన పాటించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

వైద్య సిబ్బంది లేకపోవడంతో యూహెచ్‌సీలో ఖాళీగా ఉన్న కుర్చీలు

'ఉద్యమకారుల హామీలను వెంటనే నెరవేర్చాలి'

చెన్నారావుపేట/ఖానాపురం, నవంబర్ 25 :ఎన్నికల సందర్భంగా తెలంగాణ ఉద్యమకారులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు రజినీకాంత్ అన్నారు. ఈ నెల 27, 28 తేదీల్లో కరీంనగర్ నుంచి వేములవాడ వరకు జరిగే పాదయాత్ర పోస్టర్‌ను సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాదయాత్రకు మలిదశ ఉద్యమకారులు తప్పక హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రాజీరు, యాదగిరి, మురళీధర్‌రెడ్డి, మాదాసి శ్రీనివాస్, కరుణాకర్, రాజు పాల్గొన్నారు. అలాగే, ఖానాపురంలో నిర్వహించిన సమావేశంలో మహాసంకల్ప పాదయాత్రను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండల ప్రధాన కార్యద